DD9 వార్త
తెలుగు దినపత్రిక

**మంచిమాట**

అతి కామం వల్ల రావణాసురుడు, అతి ఆశ వల్ల దుర్యోధనుడు, అతి దానం వల్ల బలి చక్రవర్తి నశించారు. కాబట్టి 'అతి' అన్నింటా వర్జనీయమే.



## సెమీస్‌లోకి టీమిండియా

వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో విజయం
10 ఏళ్ల రివెంజ్ తీర్చుకున్న భారత్
97 పరుగులతో అదరగొట్టిన సంజు శాంసన్

02

సంపుటి : 01 సంచిక : 193 హైదరాబాద్, మార్చి, సోమవారం 02, 2026 పేజీలు : 06 వెల : 3.00

## ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ దుర్మరణం

అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో మృతి
అధికారికంగా వెల్లడించిన ఇరాన్
దాడిలో ఖమేనీ కుమార్తె కుటుంబం మృతి
ప్రపంచ వ్యాప్తంగా సంచలనంగా మారిన ఘటన
పలు దేశాల్లో సంబరాలు.. కొన్ని చోట్ల నిరసనలు
కొత్త ఇరాన్ సుప్రీం లీడర్‌గా అయతొల్లా అలీ రెజా అరాఫీ



03

## విదేశాంగ విధానంలో మోడీ విఫలం

భారత్ ప్రయోజనాలకు ద్రోహం
అంతర్జాతీయ అంశాల్లో మౌనం సరికాదు
కాంగ్రెస్ సీనియర్ నేత జై రాం రమేశ్
కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం
భారత్ నైతికత దెబ్బతీస్తున్నారని మండిపాటు
దేశానికి స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు



03

# గల్ఫ్ ప్రాంతాల్లో తెలుగు ప్రజలకు సీఎం అలర్ట్

## అప్రమత్తంగా ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచన
భద్రతా మార్గదర్శకాలు పాటించాలన్న సీఎం
రాయబార కార్యాలయాలతో సమన్వయం ముఖ్యం
గల్ఫ్ దేశాల్లో పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వ నిఘా

**డిడి9 వార్త, హైదరాబాద్**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గల్ఫ్ దేశాలు, ఇరాన్ ప్రాంతాల్లో ఉన్న తెలుగువారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధం కొనసాగుతున్నట్లు వస్తున్న వార్తల దృష్ట్యా భద్రతా మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను నిరంతరం గమనించాలని తెలిపారు.

**పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా**

ఇరాన్, ఇజ్రాయెల్ సహా ఇతర గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజల పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నదని సీఎం తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వారిని సురక్షితంగా స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని స్పష్టం చేశారు. అవసరమైతే తక్షణ చర్యలు తీసుకునేందుకు అధికారులను సిద్ధంగా ఉండాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ఆయా దేశాల్లోని భారత ఎంబసీలు, కాన్సులేట్లతో నిరంతర సంప్రదింపులు

మిగతా 2లో..





# అభివృద్ధికి అడ్డంకిగా మారిన కాంగ్రెస్


## పుదుచ్చేరి సభలో ప్రధాని నరేంద్ర మోడీ

అభివృద్ధి డబుల్ ఇంజిన్ బలం ఇస్తామని హామీ
మదురైలో రూ.4 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
కాంగ్రెస్ పాలనపై మోడీ తీవ్ర విమర్శలు
కేంద్ర అభివృద్ధి పనులపై కీలక వ్యాఖ్యలు
కేంద్ర బడ్జెట్‌లో మౌలిక వసతులకు రూ.12 లక్షలు
ఆయుష్మాన్ భారత్‌తో కోట్లాది మందికి మేలు
పుదుచ్చేరిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్న మోడీ

**డిడి9 వార్త, పుదుచ్చేరి**

పుదుచ్చేరి అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ అడ్డంకిగా మారిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. గతంలో కాంగ్రెస్-డీఎంకే పాలనలో అవినీతి, నేరాలు, రాజకీయ అస్థిరత పెరిగాయని ఆరోపించారు. ఆ కాలంలో పేదల సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రస్తుతం కేంద్రం, యూటీ ప్రభుత్వం కలిసి పనిచేయడం వల్ల పుదుచ్చేరి వేగంగా అభివృద్ధి దిశగా సాగుతోందని చెప్పారు.పుదుచ్చేరిలో ఆదివారం జరిగిన భారీ సభలో మాట్లాడిన మోడీ, "ఉత్తమ పుదుచ్చేరి" లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఉత్తమం అంటే వ్యాపారం, విద్య, ఆధ్యాత్మికత, పర్యాటకం వంటి అన్ని రంగాల్లో ముందుండాలని ఆయన వివరించారు. గత నాలుగున్నరేళ్లలో ఆ దిశగా స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు. కేంద్రం, పుదుచ్చేరి ప్రభుత్వం ఒకే ఆలోచనతో పనిచేస్తే ఫలితాలు మరింత మెరుగ్గా వస్తాయని చెప్పారు. పుదుచ్చేరి గొప్ప సంస్కృతి, ఆధ్యాత్మిక

మిగతా 2లో..





## ఖమ్మంలో గడ్డపార రాజ్యం

రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే పేదల ఇళ్ల కూల్చివేత
రాష్ట్రంలో ఉన్నది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
వెలుగుమట్ల ప్రాంతం పరిశీలన

**డిడి9 వార్త, హైదరాబాద్**

రాష్ట్రంలో ఉన్నది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు దుయ్యబట్టారు. ఆదివారం ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా వెలుగుమట్ల ప్రాంతంలో ఆశ్రయం కోల్పోయిన బాధితులను పరామర్శించారు. గత వారం రోజుల నుంచి ఖమ్మంలోని భూదాన్ భూమి నిర్వాసితుల ఆక్రందన యావత్ తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజల సంక్షేమం కోసం పని చేసే ప్రభుత్వం ఏమాత్రం కాదని, పూర్తిగా ప్రజా వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసమే నిరు పేదల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చివేసిందని

మిగతా 2లో..

# మరో బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

## 17 మంది మృతి.. మరో 13 మందికి గాయాలు

మహారాష్ట్రలో నాగ్‌పూర్‌లో దుర్ఘటన
ప్రమాద సమయంలో భవనంలో 30 మంది
ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం
సమగ్ర దర్యాప్తు జరపాలని ఆదేశాలు
మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం



**డిడి9 వార్త, నాగ్‌పూర్**

మహారాష్ట్రలో భారీ విషాదం చోటుచేసుకుంది. నాగపూర్ సమీపంలోని కటోల్ ప్రాంతంలో ఉన్న బాణాసంచా కర్మాగారంలో ఆదివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 17 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఒక్కసారిగా సంభవించిన ఈ పేలుడుతో భవనం పూర్తిగా కూలిపోయి శిథిలాలుగా మారింది. ప్రమాద సమయంలో కర్మాగారంలో సుమారు 30 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆకస్మికంగా పేలుడు సంభవించడంతో భవనం ఒక్కసారిగా కూలిపోవడంతో పలువురు లోపలే చిక్కుకుపోయారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.మొదట 15 మంది మృతి చెందినట్లు సమాచారం వచ్చినప్పటికీ, తర్వాత మృతుల సంఖ్య 17కు పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. ఇంకా శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. అందుకే శోధన చర్యలు ఆపకుండా కొనసాగిస్తున్నారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

మిగతా 2లో..



## మూసీ బాధితులకు అండగా బీఆర్ఎస్

రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యం
మూసీ పేరిట స్కాం
బాధిత కుటుంబాలకు బెదిరింపులు ఆపాలి
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**డిడి9 వార్త, హైదరాబాద్**

మూసీ బాధితుల కోసం బీఆర్ఎస్ పార్టీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం నడుస్తున్నదని మండిపడ్డారు. హైదరాబాద్‌లో మూసీ ప్రాజెక్టులో భాగంగా ఇళ్లను, భూములను, అపార్ట్‌మెంట్లను కోల్పోతున్న రాజేంద్రనగర్ ప్రాంతంలోని హైదర్ షా కోట్, మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్

మిగతా 2లో..

# అభివృద్ధికి అడ్డంకిగా మారిన కాంగ్రెస్

**మొదటిపేజీ తరువాయి**



వారసత్వానికి నిలయం అని మోదీ కొనియాడారు. మహాకవి సుబ్రమణ్య భారతి ఇక్కడి నుంచే జాతీయ భావజాలాన్ని ప్రజల్లో నింపారని గుర్తుచేశారు. అలాగే శ్రీ అరబిందో ప్రపంచానికి కొత్త ఆధ్యాత్మిక దృక్పథాన్ని అందించారని పేర్కొన్నారు. ఈ భూమిలో ఉండటం గౌరవంగా ఉందని అన్నారు.

ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో మౌలిక వసతుల కోసం రూ.12 లక్షల కోట్ల రికార్డు కేటాయింపులు చేశామని మోదీ తెలిపారు. దీని వల్ల పుదుచ్చేరికి కూడా లాభం చేకూరుతుందని చెప్పారు. ఇంతకుముందు రాష్ట్రాలకు మాత్రమే వర్తించిన మూలధన పెట్టుబడి పథకాన్ని ఇప్పుడు పుదుచ్చేరికి కూడా అందుబాటులోకి తెచ్చామని వెల్లడించారు. మంచి రోడ్లు, తాగునీరు, తీర ప్రాంత అభివృద్ధి, పాఠశాలలు, ఆస్పత్రులు వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు పెడుతున్నామని చెప్పారు. ఇవి ప్రజల రోజువారీ జీవితాన్ని మెరుగుపరుస్తాయని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల పుదుచ్చేరి తలసరి ఆదాయం పెరిగిందని మోదీ పేర్కొన్నారు. ఉన్నత విద్యా రంగంలోనూ అభివృద్ధి జరుగుతోందన్నారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో కొత్త లెక్చర్ హాళ్లు, బాలికల హాస్టల్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

ఆరోగ్య రంగంలో కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కోట్లాది కుటుంబాలు లాభపడుతున్నాయని చెప్పారు. పుదుచ్చేరి వైద్య పర్యాటక కేంద్రంగా ఎదగగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే తొమ్మిది వైద్య కళాశాలలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడితే కాలుష్యం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. విద్యార్థులు, రైతులు, వ్యాపారులకు ఉపయోగపడేలా వందల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. పట్టణ రద్దీ తగ్గించేందుకు రూ.140 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మించామని చెప్పారు. అదనంగా రూ.1,000 కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టులను ప్రకటించారు. మొత్తం రూ.2,700 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించి జాతికి అంకితం చేసినట్లు వెల్లడించారు.

పుదుచ్చేరి ఇప్పటికే దేశవ్యాప్తంగా పర్యాటకులకు ఆకర్షణగా మారిందని మోదీ అన్నారు. వీకెండ్ టూర్లకు పెద్ద సంఖ్యలో ప్రజలు ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. ఆధ్యాత్మిక, పర్యావరణ, పర్యాటక రంగాల్లో మరింత పెట్టుబడులు వస్తే ఈ ప్రాంతం కొత్త స్థాయికి చేరుకుంటుందని అభిప్రాయపడ్డారు.ఇక తమిళనాడులో జరిగిన మరో కార్యక్రమంలో కూడా మోదీ అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందన్నారు. ఈ లక్ష్య సాధనలో తమిళనాడు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మదురైలో రూ.4,000 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రైల్వే రంగంలో గత దశాబ్దంలో పెద్ద మార్పులు వచ్చాయని మోదీ తెలిపారు. తమిళనాడుకు రైల్వే బడ్జెట్‌ను గణనీయంగా పెంచామని చెప్పారు. 2009-14 మధ్య రూ.880 కోట్లు కేటాయించగా, 2026-27లో ఒక్క ఏడాదికే రూ.7,600 కోట్లు కేటాయించినట్లు వివరించారు. సుమారు 1,300 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్లు వేసినట్లు చెప్పారు. 97 శాతం మార్గాల్లో విద్యుద్దీకరణ పూర్తి చేశామని పేర్కొన్నారు. అనేక అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మించామని తెలిపారు.జాతీయ రహదారుల అభివృద్ధిలోనూ తమిళనాడు ముందంజలో ఉందని చెప్పారు. 2014 తర్వాత 4,000 కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారులు నిర్మించామని గుర్తు చేశారు. రవాణా సదుపాయాలు మెరుగుపడితే పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

బెంగళూరు-చెన్నై, చెన్నై-హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్ల ప్రకటన ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపుతుందని మోదీ అభిప్రాయపడ్డారు. వేగవంతమైన రవాణా ద్వారా వ్యాపారం, పరిశ్రమలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. పుదుచ్చేరి, తమిళనాడులో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేస్తే ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరుతుందని చెప్పారు. ప్రజల సహకారంతో 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.

# గల్ఫ్ ప్రాంతాల్లో తెలుగు ప్రజలకు సీఎం అలర్ట్

**మొదటిపేజీ తరువాయి**

కొనసాగించాలని కూడా సూచించారు. తెలంగాణ ప్రజల భద్రతే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు**

ప్రస్తుతం పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నందున అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటకు రావొద్దని సీఎం సూచించారు. స్థానిక ప్రభుత్వాలు, భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

**కేంద్రానికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**

ఇదే సమయంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వానికి కీలక విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ దేశాల్లో పెద్ద సంఖ్యలో తెలంగాణ ప్రజలు ఉన్నారని, యుద్ధ పరిస్థితుల దృష్ట్యా వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఏవైనా సమస్యలు తలెత్తితే తెలంగాణ ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అవసరమైతే ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి ప్రజలను రప్పిస్తామని భరోసా ఇచ్చారు.

**బహ్రెయిన్‌లో 50 వేల మందికి పైగా ఏపీ వాసులు**

మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజల భద్రతపై కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు బహ్రెయిన్‌లో ఉన్న తెలుగువారి పరిస్థితిపై ఆరా తీశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 50 వేల మంది వరకు బహ్రెయిన్‌లో వివిధ రంగాల్లో పనిచేస్తున్నారని సమాచారం.

ప్రత్యేకంగా నర్సీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది ఉపాధి కోసం అక్కడికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఎన్నారై ప్రతినిధి శెట్టి సతీష్‌తో ఫోన్‌లో మాట్లాడి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బహ్రెయిన్‌లో ఉన్న తెలుగువారు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ఏపీఎన్ఆర్టీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందిస్తుందని స్పష్టం చేశారు.

**గల్ఫ్‌లో తెలుగు ప్రజల ఆందోళన**

గల్ఫ్ దేశాల్లో లక్షలాది మంది తెలుగువారు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. నిర్మాణ రంగం, వైద్య రంగం, సేవారంగాల్లో ఎక్కువమంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం గగనతల పరిమితులు, విమాన రద్దులు, భద్రతా హెచ్చరికల కారణంగా వారు ఆందోళనకు గురవుతున్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణల నేపథ్యంలో ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరగడంతో పలు దేశాలు అప్రమత్తమయ్యాయి. ఈ ప్రభావం అక్కడి భారతీయులపై కూడా పడే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాయి.

**ఎంబసీలతో నిరంతర సంప్రదింపులు**

తెలంగాణ ప్రభుత్వం భారత విదేశాంగ శాఖతో పాటు గల్ఫ్ దేశాల్లోని ఎంబసీలతో సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. అవసరమైతే హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేసి, సమాచారం సేకరించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వర్గాలు తెలిపాయి. అలాగే, కుటుంబ సభ్యులు ఆందోళన చెందకుండా అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని ప్రభుత్వం సూచించింది. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని హెచ్చరించింది.

**ముందస్తు చర్యలు కీలకం**

ప్రస్తుతం పరిస్థితులు మారుతూ ఉండటంతో ఏ క్షణంలోనైనా పరిణామాలు మారే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల విదేశాల్లో ఉన్న తెలుగువారు స్థానిక చట్టాలు, భద్రతా సూచనలు ఖచ్చితంగా పాటించాల్సిన



అవసరం ఉందని అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైతే ప్రత్యేక నియంత్రణ గది ఏర్పాటు చేసి సమన్వయం చేస్తామని సంకేతాలు ఇచ్చింది. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరింది. గల్ఫ్ ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. విదేశాల్లో ఉన్న తమ రాష్ట్ర ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేస్తున్నాయి. పరిస్థితులను నిరంతరం గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వాలు భరోసా ఇస్తున్నాయి.

# ఖమ్మంలో గడ్డపార రాజ్యం

**మొదటిపేజీ తరువాయి**

మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస కనికరం లేకుండా ఇళ్లను నేలమట్టం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత న్యాయస్థానం యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. పత్రాలు అసలైనవి కావని సాకులు చెబుతూ పేదల ఇళ్లపై భారీ యంత్రాలను ప్రయోగించారని రాంచందర్ రావు మండిపడ్డారు. అనంతరం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో తలదాచుకున్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కష్ట కాలంలో బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికార వర్గాలకు అత్యంత సన్నిహితులైన రియల్టర్లకు ఆ భూములను కట్టబెట్టేందుకే దాడులు చేశారని విమర్శించారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అణగారిన వర్గాల పక్షాన నిలబడుతుందని చెప్పారు. బాధితులకు ప్రభుత్వమే సొంత ఖర్చులతో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి సంపూర్ణ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. స్థానిక ప్రజలతో కలిసి భారీ ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, ఇతర బీజేపీ నేతలు పాల్గొన్నారు.

**నేడు నిరాహార దీక్ష**

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో బీజేపీ ఇందిరాపార్క్ వద్ద ఇవాళ నిరాహార దీక్షకు పిలుపునిచ్చింది. ఉదయం 11 గంటలకు నిరాహార దీక్షను చేపడుతున్నది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతారు. పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, బీజేపీ రాష్ట్ర పదాధికారులు, నాయకులు ఈ దీక్షలో పాల్గొంటారు.



# మరో బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు



**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 17 మంది మృతి చెందారని, 18 మంది గాయపడినట్లు ఆయన తెలిపారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం నాగ్‌పూర్‌కు తరలించినట్లు చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ప్రమాద స్థలంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో శిథిలాలను తొలగించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల అసలు కారణం ఏమిటన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. సాంకేతిక నిపుణుల బృందాలు కూడా రంగంలోకి దిగి పరిశీలనలు ప్రారంభించాయి. పేలుడు పదార్థాల భద్రతా ప్రమాణాలు పాటించాయా లేదా అన్న దానిపై విచారణ జరపనున్నారు. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని ప్రభుత్వం ఉన్నతాధికారులను ఆదేశించింది. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. అలాగే సంబంధిత కర్మాగారం యాజమాన్యం కూడా అదనపు సాయం అందజేస్తుందని సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సీఎం సూచించారు.

స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, పేలుడు చాలా తీవ్రంగా ఉండటంతో సమీప గ్రామాల వరకూ భారీ శబ్దం వినిపించింది. కొన్ని ఇళ్ల కిటికీలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం. మంటలు చెలరేగడంతో పొగ దట్టంగా వ్యాపించింది. అగ్నిమాపక సిబ్బంది గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. బాణాసంచా కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలపై మళ్లీ చర్చ మొదలైంది. ఇటువంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల ప్రాణాల భద్రతపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. సరైన అనుమతులు, భద్రతా పరికరాలు, శిక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయా అనే కోణంలో అధికారులు విచారణ చేస్తున్నారు. మృతుల కుటుంబాల్లో విషాద వాతావరణం నెలకొంది. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కార్మికులే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం తక్షణ ఉపశమనం ఇచ్చినా, దీర్ఘకాలికంగా వారికి ఉపాధి, భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం శిథిలాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారా అనే విషయంపై స్పష్టత కోసం అధికారులు శ్రమిస్తున్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాన్ని కూడా అధికారులు కొట్టిపారేయడం లేదు.

ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. పరిశ్రమల భద్రతపై మరింత కఠిన నిబంధనలు అమలు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు బయటపడిన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.నాగ్‌పూర్ సమీపంలో జరిగిన ఈ బాణాసంచా కర్మాగార పేలుడు రాష్ట్రాన్ని విషాదంలో ముంచెత్తింది. సహాయక చర్యలు కొనసాగుతుండగా, బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని ప్రభుత్వం హామీ ఇస్తోంది. ఈ ఘటన మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలకు దారితీయాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# మూసీ బాధితులకు అండగా బీఆర్ఎస్

**మొదటిపేజీ తరువాయి**

బాధితులను ఆదివారం కలిసి వారికి సంఘీభావం తెలిపారు. మూసీ బాధితుల కోసం వారు నిర్వహించిన 'మూసీ దండి మార్చ్' పాదయాత్రలో మూడున్నర కిలోమీటర్ల పాటు బాధితులను కలుస్తూ కేటీఆర్ ముందుకు సాగారు. ఆ తర్వాత మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ దగ్గర జరిగిన సమావేశంలో మాట్లాడారు. రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు తమ భూములను, అపార్ట్‌మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని, ఈ పోరాటంలో బీఆర్ఎస్ అండగా ఉంటుందని, తిరిగి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరి భూములు, ఇళ్లు పోకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

**అటు దేశంలో.. ఇటు రాష్ట్రంలో..**

ఒకవైపు దేశంలో బీజేపీ బుల్డోజర్ రాజ్యం చేస్తున్నది అంటూ కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీతో పాటు మిగిలిన నేతలంతా చెబుతుంటే, తెలంగాణలో జరుగుతున్న బుల్డోజర్ రాజ్యాన్ని ఆపకుండా మౌనంగా ఉంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలిసిన పాలన కేవలం ఇండ్లను కూలగొట్టడం, భూములు ఆక్రమించడం, రియల్ ఎస్టేట్ దందా చేయడం, దానికోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేయడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఇళ్లను కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. రెండేళ్లలో ఒక ప్రాజెక్ట్ గానీ, ఒక ఇల్లు గానీ, ఒక రోడ్డు గానీ వేయకుండా కేవలం విధ్వంసమే తమ విధానంగా పెట్టుకుని ముందుకు పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అపార్ట్‌మెంట్ వాసులు, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ఎన్ని రకాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా, చివరికి పసిపాపల పట్ల కనికరం చూపాలని కోరినా కర్కశంగా ఇళ్లను ఖాళీ చేయిస్తూ, బెదిరింపులకు దిగుతూ విధ్వంసానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇళ్లను కూలగొట్టడమే పనిగా పెట్టుకున్నదని ఆరోపించారు. అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో వందల మంది ఇళ్లు కూలగొట్టారని, అటు రామగుండం, మహబూబ్ నగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఇబ్బంది కలిగేలా, వారి జీవితాలను చిన్నాభిన్నం చేసేలా చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు.




# సెమీస్‌లోకి టీమిండియా

- వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో విజయం
- 10 ఏళ్ల రివెంజ్ తీర్చుకున్న భారత్
- 97 పరుగులతో అదరగొట్టిన సంజు శాంసన్

**డిడి9 వార్త, కోల్‌కతా:**

టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం వెస్టిండీస్ వర్సెస్ టీమిండియా మధ్య సూపర్ 8 మ్యాచ్ జరిగింది. కచ్చితంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన టీమిండియా, నేరుగా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో చాలా రోజుల తర్వాత ఫామ్‌లోకి వచ్చిన సంజు శాంసన్ 97 పరుగులు చేసి తన సత్తా ఏంటో చాటాడు. భయంకరమైన ఇన్నింగ్స్ ఆడి టీమిండియాను సెమీ ఫైనల్‌కు చేర్చాడు. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లకు 195 పరుగులు చేసింది. అయితే, ఈ లక్ష్యాన్ని కేవలం 5 వికెట్లు కోల్పోయి 19.2 ఓవర్లలో టీమిండియా ఛేదించింది.

**పదేళ్ల రివెంజ్ తీర్చుకున్న టీమిండియా**

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా పది సంవత్సరాల పగను భారత్ తీర్చుకుంది. 2016 సమయంలో టీ20 ప్రపంచ కప్ జరగగా అప్పుడు ముంబై వేదికగా వెస్టిండీస్ వర్సెస్ టీమిండియా మధ్య సెమీ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో టీమిండియాను చిత్తు చేసి వెస్టిండీస్ ఫైనల్‌కు చేరుకుంది. అప్పటి పగను పది సంవత్సరాల తర్వాత ఈడెన్ గార్డెన్స్ వేదికగా సూర్య సేన తీర్చుకుంది. దీంతో టీమిండియా ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా కనిపిస్తున్నారు.




# కవితకు క్లీన్ చిట్... జిల్లా జాగృతి నాయకుల హర్షం

**నిజామాబాద్ జిల్లా, 01 మార్చి(డీడీ 9 వార్త) :**

లిక్కర్ స్కామ్ కేసులో కవితకు కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడం పట్ల జిల్లా జాగృతి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. కవితకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సత్యమే గెలిచిందని, అక్రమ ఆరోపణలు వీడి కవిత నిర్దోషిగా బయటకు రావడం సంతోషకరమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాగృతి నాయకులు కరిపే రాజు, సయ్యద్ రహీమ్, బిలిందర్ సింగ్, బాణాజి సునీల్, కరిపే అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



## విదేశాంగ విధానంలో మోడీ విఫలం

- భారత్ ప్రయోజనాలకు ద్రోహం
- అంతర్జాతీయ అంశాల్లో మౌనం సరికాదు
- కాంగ్రెస్ సీనియర్ నేత జై రాం రమేశ్
- కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం
- భారత్ నైతికత దెబ్బ తీస్తున్నారని మండిపాటు
- దేశానికి స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు



**డిడి9 వార్త, న్యూఢిల్లీ**

కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం కీలక అంతర్జాతీయ అంశాల్లో సరైన వైఖరి చూపడం లేదని ఆరోపించింది. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల విషయంలో కేంద్రం మౌనం వహించడం భారత విలువలకు విరుద్ధమని పేర్కొంది. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడులకు ముందు ప్రధాని ఇజ్రాయెల్ పర్యటన చేయడం తగదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని పర్యటన ముగిసిన కొద్ది రోజులకే దాడులు జరిగాయని గుర్తుచేశారు. ఇలాంటి సందర్భంలో ఇజ్రాయెల్ పార్లమెంటు వేదికగా ప్రసంగించడం ద్వారా భారత్ నైతిక స్థాయిని దెబ్బతీశారని విమర్శించారు. తనను 'విశ్వగురు'గా చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారని, కానీ అంతర్జాతీయ రాజకీయాల్లో స్పష్టత లేకుండా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఇరాన్‌లో కీలక వ్యక్తుల హత్యలపై కేంద్రం స్పందించకపోవడం దేశ సూత్రాలకు విరుద్ధమని జైరాం రమేశ్ పేర్కొన్నారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్ పట్ల సానుకూల వైఖరి చూపుతున్నారని కాంగ్రెస్ విమర్శించింది. పాక్ ఆర్మీ చీఫ్‌ను ప్రశంసించడం, అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ చర్యలకు మద్దతు ఇవ్వడం వంటి విషయాలపై కేంద్రం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించింది. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత కూడా స్పష్టమైన స్పందన రాలేదని పేర్కొంది.

అలాగే "ఆపరేషన్ సిందూర్" అంశాన్ని కూడా కాంగ్రెస్ ప్రస్తావించింది. ఈ ఆపరేషన్ ఆగిన విషయాన్ని తొలుత అమెరికా ప్రకటించిందని, కానీ భారత్ నుంచి స్పష్టత రాలేదని విమర్శించింది. విదేశాంగ నిర్ణయాల్లో పారదర్శకత లేకపోవడం దేశానికి నష్టం చేస్తోందని అభిప్రాయపడింది.భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేసింది. ప్రధాని విజ్ఞప్తి మేరకే ట్రేడ్ డీల్ ఖరారైందని ట్రంప్ ప్రకటించారని గుర్తుచేసింది. అయితే ఆ ఒప్పందం ఏకపక్షంగా ఉందని ఆరోపించింది. భారత మార్కెట్‌ను అమెరికా ఉత్పత్తులకు తెరవడానికి పెద్ద హామీలు ఇచ్చారని, కానీ భారత్‌కు తగిన లాభాలు లభించలేదని పేర్కొంది.

అమెరికా సుంకాల విధానంపై అక్కడి సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసిన విషయాన్ని కాంగ్రెస్ ప్రస్తావించింది. ప్రపంచ దేశాలపై ఏకపక్షంగా సుంకాలు విధించడం రాజ్యాంగ విరుద్ధమని అమెరికా కోర్టు అభిప్రాయపడిందని తెలిపింది. ఈ నేపథ్యంలో ట్రేడ్ ఒప్పందం త్వరగా ఖరారు చేయడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయేమోనని కాంగ్రెస్ అనుమానం వ్యక్తం చేసింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై కూడా స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికాతో ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి దిగుమతులు తగ్గిస్తామని హామీ ఇచ్చారా లేదా అన్న దానిపై కేంద్రం వివరణ ఇవ్వాలనింది.

చైనా విషయంలో కూడా కేంద్రం వైఖరి సరైనదికాదని కాంగ్రెస్ ఆరోపించింది. గాల్వన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత ప్రధాని చేసిన ప్రకటనల వల్ల భారత్ బలహీన స్థితిలో నిలిచిందని పేర్కొంది. 2020లో జరిగిన ఘర్షణలో 20 మంది భారత సైనికులు అమరులైన విషయం గుర్తుచేసింది. ఆ సమయంలో చైనాకు అనుకూలంగా వ్యాఖ్యానించినట్లు ఆరోపిస్తూ, దాని ప్రభావం చర్చల్లో కనిపించిందని కాంగ్రెస్ తెలిపింది.

మొత్తంగా కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం వల్ల భారత్ అంతర్జాతీయ వేదికపై స్పష్టమైన దిశ లేకుండా ఉందని కాంగ్రెస్ అభిప్రాయపడింది. ముఖ్యమైన అంతర్జాతీయ సంఘటనలపై ప్రభుత్వం మౌనం పాటించడం దేశ ప్రయోజనాలకు హానికరమని పేర్కొంది. విదేశాంగ అంశాల్లో పారదర్శకత, స్పష్టత అవసరమని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకుని దేశ ప్రయోజనాలను కాపాడేలా నిర్ణయాలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. దేశ భద్రత, ఆర్థిక ప్రయోజనాలు, అంతర్జాతీయ గౌరవం దృష్టిలో ఉంచుకుని విదేశాంగ విధానాన్ని పునఃసమీక్షించాలని సూచించింది.

# ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ దుర్మరణం

- అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో మృతి
- అధికారికంగా వెల్లడించిన ఇరాన్
- దాడిలో ఖమేనీ కుమార్తె కుటుంబం మృతి
- ప్రపంచ వ్యాప్తంగా సంచలనంగా మారిన ఘటన
- పలు దేశాల్లో సంబరాలు.. కొన్ని చోట్ల నిరసనలు
- కొత్త ఇరాన్ సుప్రీం లీడర్‌గా అయతొల్లా అలీ రెజా అరాఫీ
- అమెరికా పెద్ద తప్పు చేసిందన్న ఇరాన్
- ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరిక
- నిర్విరామంగా కొనసాగుతున్న దాడులు

**డిడి9 వార్త, ఇరాన్**

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త సైనిక చర్యల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించారనే వార్తలు సంచలనం సృష్టించాయి. ఈ విషయాన్ని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా ప్రకటించినట్లు సమాచారం. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కూడా కీలక ప్రకటన చేశారు.

**ట్రంప్ ప్రకటనతో ప్రపంచ దృష్టి**

ట్రంప్ తన పోస్టులో ఖమేనీని "చరిత్రలో అత్యంత క్రూర నాయకుల్లో ఒకరు"గా పేర్కొంటూ, సంయుక్త ఆపరేషన్‌లో అతను హతమయ్యాడని వెల్లడించినట్లు తెలుస్తోంది. అత్యున్నత నిఘా వ్యవస్థలు, ఆధునిక ట్రాకింగ్ పరికరాల సాయంతో ఖమేనీ కదలికలను గమనించి ఈ దాడి చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మకంగా కలిసి పనిచేయడం వల్లే ఈ ఆపరేషన్ విజయవంతమైందన్నారు. ఇరాన్ ప్రజలు తమ దేశాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఇదే సరైన సమయమని ట్రంప్ పిలుపునిచ్చినట్లు సమాచారం. ఐఆర్‌జీసీ, ఇరాన్ సైన్యం ఇకపై పోరాటానికి సిద్ధంగా లేరని, వారు రక్షణ కోరుతున్నారని కూడా ఆయన వ్యాఖ్యానించినట్లు వార్తలు చెబుతున్నాయి.

**ఇజ్రాయెల్ వైఖరి**

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు విడుదల చేసిన వీడియోలో ఖమేనీ మరణాన్ని నేరుగా ధృవీకరించకపోయినా, అతని నివాస సముదాయం పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. ఈ దాడుల్లో రివల్యూషనరీ గార్డ్ కమాండర్లు, అణు శాస్త్రవేత్తలు కూడా మరణించినట్లు పేర్కొన్నారు. ఇరాన్ కీలక రక్షణ కేంద్రాలే లక్ష్యంగా దాడులు జరిగాయని చెప్పారు. అమెరికా రక్షణ విభాగం ఈ ఆపరేషన్‌కు "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" అని పేరు పెట్టినట్లు సమాచారం.

**భారీ బాంబుదాడులు**

శనివారం తెల్లవారుజామున టెహ్రాన్‌లో ఖమేనీ అధికారిక నివాసం, కార్యాలయ సముదాయంపై దాదాపు 30 భారీ బాంబులు ప్రయోగించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. దాడి సమయంలో ఖమేనీ భూగర్భ బంకర్‌లో ఉన్నారని, అయితే బాంబుల తీవ్రతకు ఆ బంకర్ కూడా ధ్వంసమైందని సమాచారం. శాటిలైట్ చిత్రాలు టెహ్రాన్‌లోని ఆ ప్రాంతం పూర్తిగా శిథిలాలుగా మారిన దృశ్యాలను చూపిస్తున్నాయని వార్తలు చెబుతున్నాయి.

**ఇరాన్ అధికారిక ప్రకటన**

ఇరాన్ మీడియా ఖమేనీ మరణాన్ని ధృవీకరించినట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు కూడా ఈ దాడుల్లో మృతి చెందినట్లు సమాచారం. ప్రభుత్వం 40 రోజుల పాటు సంతాప దినాలు పాటించనున్నట్లు ప్రకటించినట్లు వార్తలు చెబుతున్నాయి. ఖమేనీని "అమరవీరుడు"గా అభివర్ణించిన ఇరాన్ ప్రభుత్వం, ఈ దాడికి ప్రతీకారం తప్పదని హెచ్చరించినట్లు సమాచారం.

**కొత్త సుప్రీం లీడర్ నియామకం**

ఖమేనీ మరణం నేపథ్యంలో ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అయతొల్లా అలీ రెజా అరాఫీను నియమించినట్లు వార్తలు చెబుతున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 111 ప్రకారం తాత్కాలిక మండలి బాధ్యతలు చేపట్టనుంది. తర్వాత అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ పూర్తిస్థాయి సుప్రీం లీడర్‌ను ఎన్నుకోనుంది. అరాఫీ ఇరాన్‌లో ప్రభావశీల మతపెద్దగా గుర్తింపు పొందారు. గార్డియన్ కౌన్సిల్ సభ్యుడిగానూ పనిచేశారు. ఖమేనీకి సన్నిహితుడిగా పేరుంది.

**ప్రతిదాడులతో మరింత ఉద్రిక్తత**

అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా భారీ క్షిపణి, డ్రోన్ దాడులు ప్రారంభించింది. ఇజ్రాయెల్‌పై వందల సంఖ్యలో డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించినట్లు సమాచారం. ఇజ్రాయెల్ వైమానిక రక్షణ వ్యవస్థలు వాటిలో చాలా వరకు అడ్డుకున్నాయని అక్కడి సైన్యం తెలిపినట్లు వార్తలు చెబుతున్నాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈ వంటి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై కూడా దాడులు జరిగాయని సమాచారం. పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి. విమానయాన సేవలు అంతరాయం పొందాయి.

ఇరాన్‌లో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు మండలిని కూడా ఏర్పాటు చేశారు. కాగా ఇరాన్ సుప్రీం అయతుల్లా అలీ ఖమేనితో పాటు మొత్తం 40 మంది టాప్ కమాండర్స్ మృతి చెందారు. దీంతో ఇరాన్ తదుపరి లీడర్ ఎవరే సస్పెన్స్ కొనసాగింది. ఈ సస్పెన్స్‌కు తాజాగా తెరపడింది. సీనియర్ మతాధికారి అయతుల్లా అలీరేజా అరాఫీని ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా ప్రకటించారు. అయతుల్లా అలిరేజా అరాఫీని తాత్కాలిక నాయకత్వ మండలి సభ్యుడిగా ఎక్స్‌పెడియెన్సీ డిస్సరన్‌మెంట్ కౌన్సిల్ ఎన్నుకుంది. అయితే ఈ విషయాన్ని ఎక్స్‌పెడియెన్సీ కౌన్సిల్ ప్రతినిధి మొహ్సేన్ డెహ్నవి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఖమేని చనిపోయిన తర్వాత ఇరాన్ రాజ్యాంగం ఆర్టికల్ 111ను యాక్టివ్ చేశారు. దీని ప్రకారం ఇరాన్‌లో అత్యవసర నాయకత్వాన్ని ఏర్పాటు చేశారు. శాశ్వత సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే వరకు ముగ్గురు సభ్యుల కౌన్సిల్ సుప్రీం లీడర్ అధికారాలను స్వీకరిస్తారు. ఈ కౌన్సిల్‌లో భాగమైన అలిరేజా అరాఫీ... అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్, ప్రధాన న్యాయమూర్తి ఘోలంహోస్సేన్ మొహ్సేనిఎజెయ్‌లతో కలిసి దేశాన్ని నడిపిస్తారని తెలుస్తోంది.

**పౌర ప్రాంతాలపై ప్రభావం**

దక్షిణ ఇరాన్‌లోని ఒక బాలికల పాఠశాలలో 80 మందికి పైగా విద్యార్థులు మరణించినట్లు ఇరాన్ వార్తా సంస్థ తెలిపినట్లు సమాచారం. ఇదే సమయంలో దుబాయ్, అబుదాబి వంటి ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు వార్తలు వచ్చాయి. ప్రపంచంలోనే ఎత్తైన భవనంగా పేరొందిన బుర్జ్ ఖలీఫా సమీపంలో క్షిపణులు వెళ్లిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. భవనానికి స్వల్ప నష్టం జరిగిందని కొన్ని కథనాలు చెబుతున్నాయి. అలాగే ప్రముఖ హోటల్ బుర్జ్ అల్ అరబ్ సమీపంలో కూడా మంటలు చెలరేగినట్లు సమాచారం. అయితే ఈ ఘటనలపై అధికారిక స్పష్టత పూర్తిగా రాలేదు.



**ప్రాంతీయ యుద్ధ భయం**

ఇజ్రాయెల్, అమెరికా దాడులతో ప్రారంభమైన ఈ ఘర్షణ, ఇరాన్ ప్రతిదాడులతో మరింత తీవ్రరూపం దాల్చింది. గల్ఫ్ ప్రాంతం అంతటా యుద్ధ వాతావరణం నెలకొంది. సైరన్లు మోగుతుండగా ప్రజలు భద్రతా ప్రాంతాలకు తరలిపోతున్నారు. మధ్యప్రాచ్యంలో దీర్ఘకాలిక యుద్ధానికి ఇది నాంది కావచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఐక్యరాజ్యసమితి సహా పలు దేశాలు తక్షణ కాల్పుల విరమణకు పిలుపునిస్తున్నట్లు సమాచారం.

**ఖమేనీ పాలనపై ఒక చూపు**

1989లో అయతుల్లా రుహోల్లా ఖొమేనీ మరణం తర్వాత ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థను బలపరిచారు. రివల్యూషనరీ గార్డ్‌ను శక్తివంతమైన సంస్థగా తీర్చిదిద్దారు. ప్రాంతీయ రాజకీయాల్లో ఇరాన్ ప్రభావాన్ని విస్తరించేందుకు కృషి చేశారు. ఇప్పుడు ఆయన మరణంతో ఇరాన్ రాజకీయ భవిష్యత్తు ఏ దిశగా వెళ్లనుందో అనిశ్చితి నెలకొంది. ఖమేనీ మృతి వార్తలు మధ్యప్రాచ్యాన్ని కుదిపేశాయి. ఈ పరిణామాలు ఎంతవరకు నిజమో, తదుపరి పరిస్థితులు ఎలా మలుపుతిప్పుతాయో ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పరిస్థితి అత్యంత ఉద్రిక్తంగా ఉంది. తదుపరి ప్రకటనలు, అంతర్జాతీయ ప్రతిస్పందనలు కీలకంగా మారనున్నాయి.

## ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి కాంగ్రెస్ నాయకుల హామీ

- కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గోండ్ల శ్రీనివాస్

**బీర్కూర్, మార్చి 01(డిడి9 వార్త):**

ఆడబిడ్డల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకం ద్వారా అనునిత్యం ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ బీర్కూర్ మండల ఉపాధ్యక్షులు గోండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామంలో గ్రామానికి చెందిన మేత్రి హన్మవ్వ, రాచకొండ లక్ష్మి, కోటగిరి నాగవ్వలకు కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాల సమయంలో ఈ పథకాలు ఎంతో ఉపయుక్తంగా మారాయని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని లబ్ధి పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గోండ్ల రాజు, నాయకులు కాదేపురం గంగన్న, కుమ్మరి గంగారాం, మేత్రి నాగు గౌండ, కోరె హావగిర్ రావు, చైనాపురం వీరప్ప, బోయి లాలయ్య, వడ్ల నాగయ్య, హట్కరి దశరథ్, చాకలి సురేష్, హొక్నారి అశోక్, ఇందూర్ గజేందర్, క్యాదని లింగప్ప, కోటగిరి సాయిలు, బోయి చిన్న సాయిలు, నల్లి భాగయ్య, వడ్ల నారాయణ, నల్లి గంగారాం, మనప్ప గారి నాగప్ప, గైని రాములు తదితరులు పాల్గొన్నారు.



## తిరుమలపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**పోతంగల్, మార్చి 01 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని తిరుమలపూర్ గ్రామంలో ఆదివారం స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ అఖిల్, డాక్టర్ ఇర్ఫాన్ రోగులను పరిశీలించి ఉచిత వైద్య సేవలు అందించారు. అవసరమైన ఔషధాలను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరం విజయవంతం కావడానికి హాస్పిటల్ సబ్ స్టాఫ్‌తో పాటు వడ్ల సురేష్ హాస్పిటల్ సిబ్బంది సహకారం అందించారు.ఉచిత సేవలందించిన వైద్యులను సర్పంచ్ బోయి సైదవ్వ, ఉప సర్పంచ్ బెలిగే సంజు కుమార్, వార్డ్ సభ్యులు కాశయ్య, లక్ష్మి, కూనపల్లి నాగేశ్వర్ పటేల్, శివరాజ్ పటేల్ శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, జీపీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మోదుగ చెట్టుకు హోలీ పండుగకు దగ్గరి బంధం ఉంది.

**బజార్హత్నూర్,మార్చి 1(డిడి9న్యూస్):-**

మోదుగ చెట్టుకు హోలీ పండుగకు దగ్గరి బంధం ఉంది. బహుకాలం నుంచి. మోదుగ చెట్టుకు శాస్త్రీయ నామం : బుటియా మోనోస్పెర్మ. మోదుగు పువ్వులకు హోలీపండుగకు విడదీయరాని బంధం ఉంది. కొన్నేళ్ళ క్రితం బదులు(పూర్వం నుంచి కూడాఅనవచ్చు) హోలీ పండుగ వస్తుందంటే, వారం రోజుల ముందుగానేపిల్లలు,యువత మోదుగు పువ్వులను తీసుకొచ్చి నీటిలో నానబెట్టేవారు.ఆ తర్వాత రేపు హోలీ పండుగ ఉంది అనగా బాగా ఉడకబెట్టేవారు.ఉడికిన పిదప ఆ వచ్చే రంగునీళ్లను చల్లారినంకా ఒక పొడుగాటి సీసాల్లో, లేదాడబ్బాలల్లో నింపుకునేవారు. హోలీ పండుగకు రసాయన రంగుల కన్నా మోదుగు పువ్వులతో ఇలా వచ్చే రంగునీళ్లను హోలీ కోసమే వాడేవారు. ఇలా వాడడం వల్ల చర్మరోగాలు రాకుండా ఉంటుందని పెద్దలు చెప్పేవాళ్ళు.



## ఒక్క చుక్క రక్తం___ మరో ప్రాణానికి ఆశాకిరణం

- సేవాభావంతో ముందుకు వచ్చిన యువత
- రక్తదానం ద్వారా సమాజానికి అండగా నిలిచిన దాతలు

**బీర్కూర్, మార్చి 01(డిడి9 వార్త):**

లయన్స్ క్లబ్ అఫ్ బీర్కూర్ ఆధ్వర్యంలో బీర్కూర్‌లోని మున్నూరుకాపు సంఘ భవనంలో నిర్వహించిన మహత్తర రక్తదాన శిబిరం ఘనవిజయం సాధించింది. సమాజ సేవకు అంకితభావంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మొత్తం 108 మంది స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొని రక్తదానం చేసి మానవతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో రక్తం కోసం ఎదురు చూస్తున్న రోగులకు అండగా నిలవాలనే సంకల్పంతో యువత, సేవాభావులు, వివిధ వర్గాల ప్రజలు పెద్దఎత్తున ముందుకు రావడం విశేషం. ఒక్కొక్కరి రక్తదానం ఒక ప్రాణాన్ని కాపాడే శక్తి కలిగి ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. దాతల స్పందన ఈ శిబిరాన్ని అత్యంత విజయవంతంగా నిలిపిందన్నారు.రక్తదానం చేసిన ప్రతి దాత నిజమైన హీరో అని, వారి సేవ వల్ల ఎన్నో కుటుంబాల్లో ఆశాకిరణాలు వెలుగుతాయని క్లబ్ ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన క్లబ్ సభ్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవకుల కృషిని వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ సందర్భంగా రక్తదాతలకు ధృవపత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. రక్తదానం వంటి మహత్తర సేవా కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని సమాజానికి తమవంతు సేవ చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు."రక్తదానం - ప్రాణదానం" అనే నినాదాన్ని సార్థకం చేస్తూ బీర్కూర్ ప్రజలు మరోసారి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.







## బ్రహ్మంగారి, గోవిందామ్మల కళ్యాణం కమనీయం.

**బజార్హత్నూర్,మార్చి,1(డిడి9న్యూస్ ):-**

బజార్హత్నూర్ మండల కేంద్రంలోని శ్రీ బ్రహ్మంగారి మందిరంలో ఆదివారం రోజు బ్రహ్మంగారి,గోవిందామ్మల కళ్యాణ మహోత్సవం ఘనంగా కమనీయంగా పలువురు భక్తుల నడుమ అంగరంగ వైభవంగానిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పలు జంటలు ఆలయం ప్రాంగణం ముందర ఈ సందర్భంగా యజ్ఞం చేశారు.ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాదవితరణ ఏర్పాటు చేశారు. ఆలయంనిర్వాహకులు టీ.పండరి,తంగేణపల్లి దిగంబర్, శంకర్,తదితరులు భక్తులకు సౌకర్యాలుఏర్పాటు చేశారు.ప్రతీ ఏడు శివరాత్రి నుంచి కామాదహనం మధ్య కాలంలో ఏదోఒక మంచి దినంచూసి ఈ కళ్యాణమహోత్సవం చేయడం జరుగుతుందని మందిర కమిటీ సభ్యులు తంగేణం పల్లిదిగంబర్ తెలిపారు. ఈ సందర్భంగా ఒక రోజుముందు నుంచి ఆలయ పరిసరాలలో భక్తుల తాకిడితో కళకళలాడింది. ఈమేరకు భజన,భక్తి పాటలతో మారు మ్రోగింది.



## ఏబిసిడి వర్గీకరణ అమరులకు ఘన నివాళులు

- **కామారెడ్డిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి కార్యక్రమం**

**కామారెడ్డి, మార్చి 01(డిడి9 వార్త):**

ఏబిసిడి వర్గీకరణ సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరించుకుంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొత్తూరు సాయిలు, కోతోల్ల యాదగిరి, బట్టు వెంకట రాములు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మి, అంబేద్కర్ సేవా సమితి ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షులు భూపతి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మన్య పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం మార్చి 1న ఏబిసిడి వర్గీకరణ కోసం అమరులైన 12 మంది త్యాగాలను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు.గత ఆరు, ఏడు సంవత్సరాలుగా ఇదే విధంగా కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నామని, ఏబిసిడి వర్గీకరణ సాధ్యమైందంటే అది అమరుల త్యాగాల ఫలితమేనని పేర్కొన్నారు. వర్గీకరణ కోసం ప్రాణత్యాగం చేసిన వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లా, మండల, గ్రామ స్థాయిలో మార్చి 1న అమరులను స్మరించుకునే కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో కస్తూరి శైలేష్, రేణుక, వాసు తదితర ఎమ్మార్పీఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హోలీ వేళ హద్దు దాటొద్దు : నిజామాబాద్ సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్, 01 మార్చి(డీడీ9 వార్త)**



రాబోయే హోలీ పండుగను పురస్కరించుకుని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ వేళ ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారులపై వెళ్లే బాటసారులపై గానీ, వాహనాలపై గానీ వారి ఇష్టానికి వ్యతిరేకంగా రంగులు చల్లడం లేద. రంగు నీటిని కొట్టడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వీధుల్లో మరియు బహిరంగ ప్రదేశాలలో గుంపులుగా ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అటువంటి వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ మేరకు నిజామాబాద్ పోలీస్ చట్టంలోని సెక్షన్ 22(1) క్లాజ్ (డి) మరియు సెక్షన్ 76 ప్రకారం ఉల్లంఘనదారులపై కేసులు నమోదు చేయాలని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ ఆంక్షలు మార్చి 2 సాయంత్రం 6 గంటల నుండి ప్రారంభమై మార్చి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని సీపీ వెల్లడించారు. నిబంధనలు అతిక్రమించే వారు సెక్షన్ 223 BNS మరియు ఇతర వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం శిక్షకు గురవుతారని హెచ్చరిస్తూ, ప్రజలందరూ పోలీసులకు సహకరించి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు.





# బాన్సువాడలో కళ్యాణలక్ష్మి–షాది ముభారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్లే పోచారం శ్రీనివాసరెడ్డి

- **178 మందికి రూ.1.78 కోట్ల ఆర్థిక సహాయం**

**బాన్సువాడ, మార్చి 01(డిడి9 వార్త):**

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని తన నివాసంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి కళ్యాణలక్ష్మి, షాది ముభారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణం, బాన్సువాడ గ్రామీణ మండలం, నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాలకు చెందిన మొత్తం 178 మంది లబ్ధిదారులకు రూ.1,78,20,648/ విలువైన చెక్కులు అందజేశారు. మండలాల వారీగా చూస్తే బాన్సువాడ గ్రామీణ మండలానికి చెందిన 54 మందికి రూ.54,06,264/, బాన్సువాడ పట్టణానికి చెందిన 30 మందికి రూ.30,03,480/, నసురుల్లాబాద్ మండలానికి చెందిన 74 మందికి రూ.74,08,584/, బీర్కూర్ మండలానికి చెందిన 20 మందికి రూ.20,02,320/ చొప్పున సహాయం అందింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డల వివాహాల కోసం ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలకు తోడ్పాటు అందించడమే లక్ష్యంగా ఈ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో నిధులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





## జాతర్ల లో వెంకటేశ్వర కళ్యాణం నిర్వహించిన ఎం పీ జీ.నగేష్.



**బజార్హత్నూర్, మార్చి, 1(డిడి9న్యూస్ ):-**

ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులుగోడం నగేష్ ఆదివారం రోజు బజార్హత్నూర్ మండలంలోని ఆయన సొంత గ్రామం అయిన జాతర్లలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్యశాస్త్రోక్తంగా జరిగిన కళ్యాణం సతీమణితో కలిసి పాల్గొని గాయత్రి హోమంనిర్వహించారు.కార్యక్రమంలో బిజెపి రాష్ట్రకౌన్సిల్ సభ్యులు తాటిపల్లి గంగాధర్ రావు,రాజేశ్వర్, వెంకన్న, నానం రమణ,సూదినందు,కల్యాణ్, జాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.ఈ మేరకు అన్నప్రసాద వితరణ చేశారు.







## ఉపాధ్యాయుల సంక్షేమమే పి ఆర్ టి యు తెలంగాణ లక్ష్యం– గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

**కామారెడ్డి, మార్చి 01(డిడి9 వార్త):**

ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల సాధనలో ముందుండటమే పి ఆర్ టి యు తెలంగాణ ప్రధాన లక్ష్యమని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. "ఉపాధ్యాయులే నా ఆశ, నా శ్వాస" అని ఆయన స్పష్టం చేశారు.ఆదివారం కామారెడ్డిలో నిర్వహించిన రాష్ట్ర, జిల్లా బాధ్యుల సమావేశం అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాషా పండితులు, పీఈటీలు, ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించడంలో పి ఆర్ టి యు తెలంగాణ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు.సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ అభ్యర్థులకు జీఓ 57/4, 57/5 అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన, ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో పదోన్నతులు, బదిలీలు నిర్వహణ కోసం కృషి చేస్తామని తెలిపారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, ఎస్ఎస్ఎ సిబ్బందికి మినిమం టైం స్కేలు అమలు చేయడంతో పాటు హెల్త్ కార్డులు అందించాలని కోరారు. మోడల్ స్కూల్స్, గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యల పరిష్కారం, ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.కామారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో జిల్లా శాఖ క్రియాశీలకంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. పదో తరగతి మూల్యాంకన కేంద్రాన్ని జిల్లాకు కేటాయించడంలో కృషి చేసిన జిల్లా అధ్యక్షులు అంబీర్ మనోహర్ రావు, ప్రధాన కార్యదర్శి జనపాల లక్ష్మీరాజంలను అభినందించారు.విద్యా కమిషన్ ఉపాధ్యాయుల వేతనాల తగ్గింపుపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. విద్యకు కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలని, ఉపాధ్యాయుల ద్వారా తీర్చిదిద్దబడే విద్యార్థులే దేశ భవిష్యత్తు అని తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్ రావు, గౌరవ అధ్యక్షులు ఓంప్రకాష్ తదితర రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.





# హాసకొత్తూరులో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

**నిజామాబాద్ జిల్లా, 01 మార్చి(డీడీ 9 వార్త) :**

లయన్స్ క్లబ్ కమ్మర్‌పల్లి ఆధ్వర్యంలో ఆదివారం హాసకొత్తూరు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరానికి గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహించిన వారిలో మోతిబిందు ఉన్నట్లు గుర్తించిన 22 మందికి వచ్చే గురువారం ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు క్లబ్ నిర్వాహకులు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు లుక్క గంగాధర్ మాట్లాడుతూ.. నిరుపేదలకు మెరుగైన కంటి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని, భవిష్యత్తులో మండలంలోని అన్ని గ్రామాల్లో ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నలిమెల రేవతి గంగారెడ్డి, కోశాధికారి తెడ్డు రమేష్, జోన్ చైర్మన్ చేరుకు పృథ్వీరాజ్ మరియు సభ్యులు పాల్గొన్నారు.



# భీమ్‌గల్ మున్సిపల్ పాలకమండలికి ఘన సన్మానం

- **లింబాద్రి గుట్టపై గిరిప్రదక్షిణ.. యోగా మిత్ర బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం**

**నిజామాబాద్ జిల్లా, 01 మార్చి(డీడీ 9 వార్త)**

భీమ్‌గల్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లింబాద్రి గుట్టపై భీమ్‌గల్ యోగా మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆదివారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా.. నూతనంగా ఎన్నికైన భీమ్‌గల్ మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, వైస్ చైర్‌పర్సన్ సంటి లత నర్సయ్యతో పాటు పాలకవర్గాన్ని యోగా మిత్ర బృందం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ నాగమణి స్వామి మాట్లాడుతూ.. భీమ్‌గల్ యోగా మిత్ర మండలి చేస్తున్న సామాజిక, ఆరోగ్య సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించారు. యోగా విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పింది భారతదేశమేనని, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా సాధన చేయడం వల్ల మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించవచ్చని సూచించారు. భీమ్‌గల్‌ను రానున్న రోజుల్లో స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆమె ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కుశలత అనంతరావు, తోట సతీష్, లక్ష్మీ భగత్, లావణ్య నర్సయ్య, సందీప్, నీలం రవి, సం గ్యానాయక్, మల్లెల అనుపమ ప్రసాద్, బాబాపూర్ ఉప సర్పంచ్ మంద గోవర్ధన్ మరియు యోగా మిత్ర బృందం పాల్గొన్నారు.



# లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు

**నిజామాబాద్ జిల్లా, 01 మార్చి(డీడీ 9 వార్త) :**

భీమ్‌గల్ మండలంలోని ఆధ్యాత్మిక క్షేత్రం లింభాచల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానాన్ని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ ఆదివారం సందర్శించారు. ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా బెజ్జోర గ్రామ సర్పంచ్ మెస్ కార్తీక్, ఉపసర్పంచ్ లింబయ్యలతో కలిసి గుట్టపైకి చేరుకున్న వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, గ్రామాభివృద్ధి జరగాలని, అలాగే ఉద్యోగులందరి సంక్షేమం కోసం స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. భక్తిభావం మనిషికి ఆధ్యాత్మిక ప్రశాంతతను ఇస్తుందని, ఇది సమాజ అభ్యున్నతికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు నంభి లింబాద్రి శర్మ వారికి దీక్షా వస్త్రాలతో సన్మానం చేసి, స్వామివారి ఆశీర్వాదాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, భీమ్‌గల్ యూనిట్ అధ్యక్షులు సృజన్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







# లక్ష్యంతో చదివి.. ఉన్నతంగా ఎదగాలి : బోధన్ ఏసీపీ శ్రీనివాస్

- **సాలూరలో ఘనంగా ప్రజ్ఞశ్రీ పాఠశాల 26వ వార్షికోత్సవం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా**
**01 మార్చి (డీడీ 9 వార్త) :**

విద్యార్థులు కేవలం పుస్తక పఠనానికే పరిమితం కాకుండా, సమాజంపై అవగాహన పెంచుకుని ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్ 26వ వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టత కలిగి ఉండాలన్నారు. పదో తరగతి అనేది జీవితంలో అత్యంత కీలకమైన మలుపు. ప్రతి విద్యార్థి సబ్జెక్టులపై పట్టు సాధించి, వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి. కేవలం మార్కులే కాకుండా, నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు పడతాయని వివరించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఆయన హితవు పలికారు. 18 ఏళ్ల వయస్సు నిండకుండా మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. రహదారి నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పుకోవచ్చని విద్యార్థులకు వివరించారు.

**క్రమశిక్షణతో కూడిన విద్యే మా బలం**

పాఠశాల కరస్పాండెంట్ లత రాజు మాట్లాడుతూ.. గడిచిన 26 ఏళ్లుగా నాణ్యమైన విద్యను అందిస్తూ ఎంతోమందిని ఉన్నత శిఖరాలకు చేర్చడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంలో ప్రజ్ఞశ్రీ ఎప్పుడూ ముందుంటుందని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతో విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.



**హోరెత్తిన ప్రాంగణం.. విద్యార్థుల సందడి**

వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలు, తాజా సినిమా పాటలకు విద్యార్థులు వేసిన స్టెప్పులు చూసి అతిథులు, తల్లిదండ్రులు మంత్రముగ్ధులయ్యారు. ఈ వేడుకలో బోధన్ టౌన్‌సీఐ వెంకట నారాయణ, రోడ్డు రవాణా అధికారి శ్రీనివాస్, ట్రస్మా పట్టణ అధ్యక్షుడు హరికృష్ణ, ఉపాధ్యాయ సంఘం ప్రతినిది ఇల్తెపు శంకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# ఆపరేషన్ కవచ్‌లో ట్రాక్టర్ దొంగతనం కేసు ఛేదన



- **రూ.5 లక్షల విలువైన ట్రాక్టర్ స్వాధీనం**
- **ఇద్దరు నిందితులు అరెస్ట్**

**కామారెడ్డి, మార్చి 01(డిడి9 వార్త):**

జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ లక్ష్యంగా అమలు చేస్తున్న "ఆపరేషన్ కవచ్"లో భాగంగా కామారెడ్డి పోలీసులు ట్రాక్టర్ దొంగతనం కేసును ఛేదించారు. రూ.5 లక్షల విలువైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. విశేషమేమిటంటే, ట్రాక్టర్ దొంగతనం జరిగిన విషయం యజమానికి తెలియకముందే పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి రికవరీ చేశారు.ఆదివారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో సదాశివనగర్ మండలం పద్మజీవాడి ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న గాంధారి ఎస్సై బి. ఆంజనేయులు, సిబ్బంది పి. వెంకటరములు, డి. హరిలాల్, అహ్మద్ షరీఫ్, కె. రాములు అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. విచారణలో ట్రాక్టర్‌ను పోసానిపేట గ్రామానికి చెందిన బండి పెంటయ్య వ్యవసాయ భూమిలోని షెడ్ నుండి దొంగతనం చేసినట్లు తేలింది. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు గంద్ర స్వామి (35), పోసానిపేట గ్రామం, రామారెడ్డి మండలం (గతంలో 7 దొంగతనం కేసులు), వడ్ల విజయ్ కుమార్ (28), జువ్వాడి గ్రామం, గాంధారి మండలం (గతంలో 1 కేసు)లు. వీరిద్దరూ గతంలో జైలులో ఉన్న సమయంలో పరిచయం ఏర్పడి మళ్లీ కలుసుకుని దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది. తేదీ 01.03.2026 తెల్లవారుజామున 4 గంటల సమయంలో పోసానిపేట గ్రామ శివారులోని బండి పెంటయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో ఉన్న రేకుల షెడ్ తాళం పగులగొట్టి,మహీంద్రా & మహీంద్రా తయారు చేసిన మహీంద్రా 475 డిఐ ఎరుపు రంగు ట్రాక్టర్ (నంబర్: AP25AR0626)ను దొంగతనం చేసి బాన్స్‌వాడలో అమ్మేందుకు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుండి రూ.5 లక్షల విలువైన ట్రాక్టర్‌తో పాటు ఒక రెడీమి స్మార్ట్‌ఫోన్, ఒక లావా కీప్యాడ్ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం యజమాని ఫిర్యాదు మేరకు రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న గాంధారి ఎస్సై బి. ఆంజనేయులు మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ప్రత్యేకంగా అభినందించినట్లు కామారెడ్డి రూరల్ ఇన్స్పెక్టర్ రామన్ తెలిపారు.జిల్లాలో నేరాలను అరికట్టడంలో భాగంగా ఆపరేషన్ కవచ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సైనిక్‌లో మెరిసిన సన్ షైన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆణిముత్యాలు

**బాన్సువాడ, మార్చి 01(డిడి9 వార్త):**




బాన్సువాడ పట్టణంలోని సన్ షైన్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబర్చారు. మొత్తం 21 మంది విద్యార్థుల్లో 20 మంది సైనిక్ స్కూల్‌కు అర్హత సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.ఎలాంటి ప్రత్యేక కోచింగ్ లేకుండానే, పాఠశాల ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, ప్రోత్సాహం మరియు విద్యార్థుల కఠిన శ్రమతో ఈ విజయాన్ని సాధించడం అభినందనీయమని యాజమాన్యం పేర్కొంది. మంచి క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషి వలననే ఈ ఫలితం సాధ్యమైందని ఉపాధ్యాయులు తెలిపారు.సాధారణంగా సైనిక్ స్కూల్ ప్రవేశం కోసం విద్యార్థులు కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతూ ఎంతో వ్యయం, శ్రమ పడుతుంటారు. అలాంటి పరిస్థితుల్లో ప్రత్యేక కోచింగ్ లేకుండానే 21 మందిలో 20 మంది అర్హత సాధించడం విశేషమని పలువురు అభిప్రాయపడ్డారు.అర్హత సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు. అనతి కాలంలోనే మంచి పేరు ప్రతిష్టలు సంపాదించిన ఈ పాఠశాల, రాబోయే రోజుల్లోనూ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.

# అమెరికా–ఇజ్రాయెల్ తమ తీరు మార్చుకోవాలి...


- **యుద్ధంతో ఏదీ సాధించలేర**
- **తాటికొండ విక్రమ్ గౌడ్**

**రంగారెడ్డి,మార్చి 1,(డిడి9 వార్త):**




United States మరియు Israel దేశాలు తమ దాడి విధానాన్ని పునరాలోచించుకోవాలని, యుద్ధాలతో సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరకదని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు శాంతి మరియు స్థిరత్వాన్నే కోరుకుంటున్నాయని ఆయన అన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అనంతరం Iran గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని ఆయన తెలిపారు. ఇప్పటికే Dubai ఎయిర్‌పోర్టులో వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయినట్లు సమాచారం రావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చిందన్నారు. భారతదేశానికి చెందిన లక్షలాది కార్మికులు Abu Dhabi, United Arab Emirates మరియు Kuwait ప్రాంతాల్లో ఉన్న నేపథ్యంలో వారి భద్రత అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రధాన మంత్రి Narendra Modi వెంటనే అంతర్జాతీయ శాంతి చర్చలకు పిలుపునివ్వాలని కోరారు. అబుదాబి మరియు యూఏఈ వంటి దేశాలపై దాడులు చేయడం అసాంఘిక చర్యలని ఆయన తీవ్రంగా ఖండించారు. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించి, సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని తాటికొండ విక్రమ్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ శాంతి కోసం అన్ని దేశాలు సంయమనం పాటించి, యుద్ధానికి బదులుగా రాజదౌత్య మార్గాలను అనుసరించాల్సిన

# నచ్చినవాడు దొరికితేనే పెళ్లి..



దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా అగ్ర కథానాయికగా కొనసాగుతున్న బ్యూటీ త్రిష కృష్ణన్ తన నటనతో, అందంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఈమె పెళ్లి గురించి ఎప్పుడూ ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో నిలుస్తూనే ఉంటుంది. తాజాగా పెళ్లి, విడాకులు, సహజీవనంపై త్రిష గతంలో చేసిన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట మళ్ళీ వైరల్ అవుతున్నాయి.

ఒక ఇంటర్వ్యూలో తన పెళ్లి ఎప్పుడు అనే ప్రశ్నకు త్రిష చాలా స్పష్టమైన సమాధానం ఇచ్చారు.. 'నన్ను చాలా మంది పెళ్లి ఎప్పుడు అని అడుగుతుంటారు. దానికి నా దగ్గర ఒకటే సమాధానం ఉంది. నాకు నచ్చిన, సరైన వ్యక్తి దొరికితేనే పెళ్లి చేసుకుంటాను. ఒకవేళ అలాంటి వ్యక్తి దొరకకపోతే, అసలు పెళ్లి జరగకపోయినా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఎందుకంటే నేను పెళ్లి చేసుకుంటే విడాకుల వరకు వెళ్లకూడదని భావిస్తున్నాను. అందుకే తొందరపడి ఎటువంటి తప్పుడు నిర్ణయం తీసుకోను' అని ఆమె వివరించారు. పెళ్లి అనేది కేవలం సమాజం కోసం తీసుకునే నిర్ణయం కాకూడదని, జీవితాంతం కలిసి ఉండగలమనే నమ్మకం కలిగినప్పుడే ఆ అడుగు వేయాలని ఆమె అభిప్రాయపడ్డారు. 'నా స్నేహితుల్లో చాలా మంది ఇష్టం లేని పెళ్లిళ్లు చేసుకుని బాధపడుతున్నారు. అలాంటి జీవితం నాకు వద్దు. ఇష్టం లేని వ్యక్తితో కలిసి నరకం అనుభవించడం కంటే ఒంటరిగా ఉండటమే ఉత్తమం' అని త్రిష చెప్పుకొచ్చారు. తనకు ప్రేమలో పడటం కంటే, తన జీవితాన్ని పంచుకోగలిగే ఒక మంచి తోడు కావాలని, నచ్చిన వ్యక్తితో కలిసి ఉండటమే తనకు ఇష్టమని ఆమె ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు.

# ఓటీటీ డేట్ ఫిక్స్ చేసుకున్న "విత్ లవ్"..



కోలీవుడ్లో 'టూరిస్ట్ ఫ్యామిలీ' వంటి బ్యూటిఫుల్ ఫ్యామిలీ డ్రామాతో మెప్పించిన యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ అబీషేన్ జీవింత్ హీరోగా నటించిన తాజా చిత్రం "విత్ లవ్". ఈ సినిమాలో 'ఛాంపియన్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన అనస్వర రాజన్ కథానాయికగా నటించింది. థియేటర్లలో క్లీన్ ఎంటర్టైనర్‌గా మంచి స్పందన లభించిన ఈ క్యూట్ రోమ్‌కామ్ మూవీ, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై అలరించేందుకు సిద్ధమైంది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ దిగ్గజ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. అయితే..

తాజా సమాచారం ప్రకారం, 'విత్ లవ్' చిత్రం మార్చి 6 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. విశేషమేమిటంటే, ఈ సినిమా కేవలం ఒక్క భాషకే పరిమితం కాకుండా పాన్ ఇండియా లెవెల్లో అన్ని ప్రధాన భాషల్లోనూ అందుబాటులోకి రాబోతోంది. సీన్ రోల్డన్ అందించిన సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవగా, ఎం ఆర్ పి ఎంటర్టైన్మెంట్స్ వారు ఈ చిత్రాన్ని నిర్మించారు. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారు, ఒక మంచి ఫీల్ గుడ్ లవ్ స్టోరీని చూడాలనుకునే వారు మరికొన్ని రోజులు ఆగితే నెట్‌ఫ్లిక్స్‌లో దీనిని ఆస్వాదించవచ్చు.

# డిసెంబరులోనే మా సినిమా లీక్ అయ్యింది!



"మా సినిమా డిసెంబరు నెలలోనే లీక్ అయిపోయింది. పైరసీదారులు విడుదలకు ముందురోజు వరకూ నిర్మాతల్ని బ్లాక్ మెయిల్ చేస్తూనే ఉన్నారు. లీకేజీ అయిందేదీ బయటకు రాకుండా అరికడుతూనే... మిగిలిన సినిమాని పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం. మంచి స్పందనతో... నా కెరీర్‌లోనే చెప్పుకోదగ్గ వసూళ్లు రావడం ఎంతో తృప్తినిచ్చింది" అన్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా, యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'విష్ణు విన్యాసం'. నయన్ సారిక కథానాయిక. సుమంత్' నాయుడు.జి, సుబ్రహ్మణ్యం నాయుడు నిర్మించారు. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి లభిస్తున్న స్పందనపై సినిమావర్గాలు ఆనందం వ్యక్తం చేస్తూ శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించాయి.

ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ "నవ్వించాలనే ప్రయత్నంతో చేసిన ఈ సినిమా లక్ష్యం నెరవేరినట్టైంది. అమెరికాలోనూ ప్రేక్షకుల నుంచి గొప్ప ఆదరణ లభిస్తోంది. ఈ సినిమాని వేగంగా విడుదల చేయడానికి కారణం లీక్ కావడమే. బృందమంతా మంచి సహకారం అందించడంతో ఇంత వేగంగా పూర్తి చేశాం" అన్నారు. నిర్మాత సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ "కుటుంబంతో కలిసి చూడాల్సిన సినిమా ఇది. ప్రతీ షోకీ వసూళ్లు పెరుగుతున్నాయి. 'మృత్యుంజయ్' కంటే ముందే ఈ సినిమాని విడుదల చేయడానికి కారణం పైరసీనే. మా సినిమాని వీడియోలుగా నాకు పంపుతూ బెదిరించారు. మా బృందం నుంచే సినిమా లీక్ అయ్యింది. దీనిపై వెంటనే చలన చిత్ర వాణిజ్య మండలికీ, పోలీసు అధికారులకీ ఫిర్యాదు చేశాం. పరిస్థితి అదుపు తప్పుతుందేమో అని వెంటనే సినిమాని పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం" అన్నారు.

# తీహార్ జైల్లో నరకం చూశాను.. గుర్తొస్తే ఇప్పటికీ భయం వేస్తుంది

మనీలాండరింగ్ కేసులో చిక్కుకుని నాలుగు నెలల పాటు తీహార్ జైలులో శిక్ష అనుభవించిన నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ సందీప విర్క్ తాజాగా తన జైలు అనుభవాలను పంచుకుంటూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. జైలు గోడల మధ్య తాను అనుభవించిన నరకాన్ని వివరిస్తూ, తన శత్రువు కూడా అలాంటి ప్రదేశంలో ఉండకూడదని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. తొలిసారి తీహార్ జైలులో అడుగుపెట్టినప్పుడు దేవుడు తనకు ఎందుకు ఇంత కఠినమైన శిక్ష విధించాడని ఎంతో బాధపడ్డానని, అక్కడి వాతావరణం చూసి భయంతో వణికిపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

జైల్లోని దారుణమైన పరిస్థితుల గురించి సందీప మాట్లాడుతూ.. 'అక్కడ వాష్‌రూమ్స్ ఎంతో మురికిగా ఉంటాయి, నేలపైనే పడుకోవాలి. తిండి కూడా ఏమాత్రం రుచిగా ఉండదు.. రోజుకు నాలుగు రోటీలు, అన్నం, పప్పు మాత్రమే ఇస్తారు. గత జన్మలో చేసిన పాపం వల్లే ఈ కర్మ నన్ను వెంటాడుతోందని అనిపించింది. నా వల్ల మా పేరెంట్స్ కూడా జైలుకు వచ్చి నన్ను కలవాల్సి రావడం నన్ను మరింత కృంగదీసింది. కొన్నిసార్లు దేవుడా నన్ను త్వరగా ఇక్కడి నుండి తీసుకెళ్లిపో అని వేడుకున్నాను' అని చెప్పుకొచ్చారు. జైలు అధికారులు కూడా కొందరు జాలి చూపిస్తే, మరికొందరు తమ కోపాన్నంతా ఖైదీలపై చూపిస్తారని ఆమె వెల్లడించారు.

అయితే, జైల్లో ఉన్నప్పుడు తన తోటి ఖైదీల దీనస్థితిని చూసి చలించిపోయానని సందీప తెలిపారు. 'కేవలం మూడు వేల రూపాయల దొంగతనం కేసులో అంధురాలైన తల్లిని వదిలి నెలల తరబడి జైల్లో మగ్గుతున్న ఒక మహిళ, అలాగే భర్త చేసిన ఆర్థిక మోసానికి శిక్ష అనుభవిస్తున్న మరో మహిళకు తాను బయటకు వచ్చాక సాయం చేశానని ఆమె వెల్లడించారు.. 'జైల్లో డబ్బు లేకపోతే ఎవరూ పట్టించుకోరు' అంటూ అక్కడ ఉండే చేదు వాస్తవాలను ఆమె కళ్లకు కట్టారు. ప్రస్తుతం సందీప చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# వరలక్ష్మి నటించడం శరత్‌కుమార్‌కు ఇష్టం లేదు..

తన కుమార్తె వరలక్ష్మి యాక్ట్ చేయడం నటుడు శరత్‌కుమార్‌కు తొలుత ఇష్టంలేదని రాధిక తెలిపారు. 'సరస్వతి' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. స్వీయ దర్శకత్వంలో వరలక్ష్మి నటించిన సినిమా ఇది. ఈ నెల 6న విడుదల కానున్న సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. చిత్ర బృందంతోపాటు రాధిక, దర్శకురాలు నందిని రెడ్డి తదితరులు హాజరయ్యారు. రాధిక మాట్లాడుతూ.. "ఇక్కడ అమితానందంలో ఉన్న వ్యక్తి నా భర్తే (శరత్‌కుమార్) అని చెప్పగలను. నిన్న మేం ఇక్కడకు వచ్చే క్రమంలో.. విమానాశ్రయంలో కొందరు అభిమానులు కలిశారు. 'తాయ్‌కిళవి'లో బాగా నటించారండీ అంటూ నన్ను, 'ఆళి' మూవీ బాగుందంటూ మరొకరు శరత్‌కుమార్‌ను కొనియాడారు. భార్యభర్తల సినిమాలు ఒకే రోజు (ఫిబ్రవరి 27) విడుదల కావడం అరుదు. మరో మహిళ మా వద్దకు వచ్చి 'మీ కుమార్తె వరలక్ష్మి అంటే చాలా ఇష్టం' అని ప్రశంసించారు. ఆ క్షణం శరత్‌కు ఎంతో గర్వకారణం" అని రాధిక పేర్కొన్నారు.

ఆయనకు ఇష్టంలేదు..

వరలక్ష్మి నటి కావడం శరత్ కుమార్‌కు తొలుత ఇష్టం లేదంటూ రాధిక సరదాగా వ్యాఖ్యానించారు. "వరలక్ష్మి సినిమాల్లోకి రావాలనుకున్నప్పుడు శరత్ వ్యతిరేకించారు. 'ఎలా నటిస్తావ్? నువ్వు యాక్ట్ చేయకూడదు' అంటూ సీరియస్ అయ్యేవారు. 'మా కుమార్తెను నటిగా ఎంపిక చేయొద్దు' అంటూ నిర్మాతలకూ ముందే చెప్పేవారు. ఈ విషయాలన్నింటినీ తన తల్లితో కలిసి వరలక్ష్మి ఓ రోజు నాతో పంచుకుంది. దీనిపై నిర్ణయం తీసుకోలేనని చెప్పి.. సినిమా సెట్స్‌లో ఉన్న శరత్ వద్దకు వారిని తీసుకెళ్లా. అప్పుడు ఆయన.. నమితతో కలిసి ఓ సాంగ్‌కు డ్యాన్స్ చేస్తున్నారు. మమ్మల్ని చూడగానే కారవాన్‌లోకి వెళ్లిపోయారు (నవ్వుతూ). తర్వాత వరలక్ష్మి నటించేందుకు అంగీకరించారు. వరలక్ష్మి తొలి సినిమా (పోడా పోడి)ని చూడగానే.. తను గొప్ప నటి అవుతుందని చెప్పా. తెలుగు సినిమాపై దృష్టి పెట్టమని వరలక్ష్మికి సలహా ఇచ్చా" అని రాధిక తెలిపారు.



# రాజమౌళి సినిమా తర్వాత హీరోకు ఫ్లాప్ శాపం..

అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి సినిమాలో నటించేందుకు సినీ తారలు క్యూ కడతారన్న సంగతి తెలిసిందే. నిడివి తక్కువ ఉన్నా, చిన్న పాత్ర అయినా చేయడానికి ఎంతో ఆసక్తి చూపిస్తారు. అయితే, రాజమౌళితో చేసిన హీరోలు తమ తర్వాతి చిత్రాలతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోతున్నారు. దీంతో ఇండస్ట్రీలో ఓ ముద్ర పడిపోయింది. దీనిపై కథానాయకుడు నిఖిల్ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. తన కొత్త చిత్రం 'స్వయంభూ' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. అదేమీ శాపం కాదన్నారు.

"నేను ఈ విషయం చెప్పవచ్చో లేదో తెలియదు. అది కేవలం యాదృచ్ఛికం. శాపాలు, మూఢ విశ్వాసాలపై నమ్మకం లేదు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' భారీ చిత్రాలు. అందులో హీరోలను ఓ రేంజ్‌లో నిలబెడుతూ వారి పాత్రలను రాజమౌళి సర్ తీర్చిదిద్దారు. ఆ స్థాయిలో హీరోను చూసిన తర్వాత దానికన్నా ఏమాత్రం తక్కువ ఉన్నా ప్రేక్షకుడు జీర్ణించుకోలేడు. ప్రభాస్ అన్నయ్య 'కల్కి' రూ.1000 కోట్ల పైన వసూలు చేసింది కదా!. తారక్ అన్న 'దేవర' కూడా సూపర్‌హిట్. ఇప్పుడు చరణ్ అన్న 'పెద్ది' వస్తోంది. ఈ శాపాలలాంటివి నమ్మను. నేను చేసిన 'కార్తికేయ' చిత్రాలు చూసి, రాజమౌళి సర్ మెచ్చుకున్నారు. జీవితంలో ఒక్కసారైనా ఆయనతో పనిచేయాలని ప్రతి నటుడు అనుకుంటారు" అని అన్నారు. తెలుగు ఇండస్ట్రీ మహిళా నటులకు అత్యంత గౌరవం ఇస్తుందన్నారు. ఇక్కడ భద్రమైన వాతావరణం ఉంటుందని చెప్పారు. హీరోయిన్ కోసం చాలా సార్లు తన కారావాన్‌ను కూడా త్యాగం చేసినట్లు తెలిపారు. అయితే, హీరోలకు ఎక్కువ మంది అభిమానగణం ఉంటారని అన్నారు. నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా సినిమా 'స్వయంభు'. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. ఇటీవల విడుదల చేసిన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. మునుపెన్నడూ చూడని యోధుడి పాత్రలో నిఖిల్ యుద్ధం చేస్తూ కనిపించారు. విజువల్స్, డైలాగులూ కూడా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాలు పెంచేలా ఉన్నాయి. దీని తర్వాత నిఖిల్ 'ఇండియా' అనే సినిమాలో నటిస్తున్నారు. అలాగే 'కార్తికేయ 3' కూడా ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లనుంది.



# 'విరోష్' వెడ్డింగ్ రిసెప్షన్.. అభిమానులకు ఇదే విజ్ఞప్తి

విజయ్ దేవరకొండ, రష్మిక వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. స్నేహితులు, కొద్దిమంది అతిథుల సమక్షంలో వీరి వివాహం జరగ్గా, ఇప్పుడు హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అభిమానులతో పాటు, ఈ వేడుకకు హాజరయ్యే అతిథులకు విజ్ఞప్తి చేస్తూ ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లో మార్చి 4న సాయంత్రం జరిగే రిసెప్షన్ వేడుక సజావుగా ఇతరుల ఇబ్బంది కలగకుండా జరగాలంటే ఆహ్వానం ఉన్న అతిథులు మాత్రమే హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఆహ్వానం లేకుండా వేడకకు వచ్చి ఇబ్బంది పడొద్దని తెలిపారు. సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, ఇతర రంగాల ప్రముఖులు రిసెప్షన్‌కు హాజరవుతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసుల ఆంక్షల నేపథ్యంలో ఆహ్వానం లేకుండా ఇతరులు, అభిమానులు ఈ కార్యక్రమానికి రావొద్దని, వచ్చి ఇబ్బందుల పాలు కావొద్దని విరోష్ జంట కోరింది. అభిమానులు, శ్రేయోభిలాషుల క్షేమమే తమకు ముఖ్యమని, మీరు ఎక్కడున్నా మీ దీవెనలు ఉంటాయని ఆశిస్తున్నట్లు తెలిపింది.



# దుబాయ్‌లో చిక్కుకున్న సోనాల్ చౌహాన్..

నటి సోనాల్ చౌహాన్ దుబాయ్‌లో చిక్కుకున్నారు. తనను భారత్‌కు చేర్చాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "గౌరవనీయ ప్రధాని నరేంద్ర మోదీ జీ.. ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో నేను దుబాయ్‌లో చిక్కుకున్నా. విమాన సర్వీసులు రద్దయ్యాయి. భారత్‌కు తిరిగి వచ్చేందుకు ఇప్పుడు సరైన మార్గం లేదు. నేను సురక్షితంగా ఇంటికి తిరిగి రావడానికి సహకారం అందించాలి" అని కోరారు. హాలీడే ట్రిప్ కోసం కొన్ని రోజుల క్రితం సోనాల్ దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. మరోవైపు, భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే.

